ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-12.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మేడారం ఆలయ అభివృద్ధి పనులు నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
2. ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు ఈ రోజు హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట లొంగిపోయారు.
3. తనపై ఆధారాలు లేని ఆరోపణలు చేసినందుకు వారం రోజుల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు తెలంగాణ జాగ్రుతి అధ్యక్షురాలు కె. కవిత లీగల్ నోటీసులు పంపించారు.
4. ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ రేపటి హైదరాబాద్ పర్యటనకు అధికారులుభారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

-----------------------

**మేడారం**

మేడారం ఆలయ అభివృద్ధి పనులు నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా మేడారం లో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క ఈ రోజు పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించి త్వరితగతిన పూర్తి

చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**(ములుగు, పీటీసీ)**

----------------------

**ఫోన్ ట్యాపింగ్ కేసు**

ఫోన్ అక్రమ ట్యాపింగ్ ఆరోపణల కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు ఈ రోజు పోలీసుల ఎదుట లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ప్రత్యేక దర్యాప్తు బ్రుందం (సిట్) అధికారి ముందు సరెండర్ అయ్యారు. ఈ కేసుకు సంబంధించి ప్రభాకర్ రావును సిట్ అధికారులు గతంలో పలు సార్లు విచారించినప్పటికీ, ఆయన దర్యాప్తుకు సహకరించడం లేదనే కారణంతో కస్టోడియల్ విచారణకు అనుమతి ఇవ్వాలని పోలీసులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం , ప్రభాకర్ రావును వారం రోజుల పాటు కస్టోడియల్ విచారణకు అప్పగించడానికి నిన్న అనుమతి మంజూరు చేసింది.

**డెస్క్**

----------------------------

**కవిత-లీగల్ నోటీసులు**

తనపై, తన భర్త అనిల్ పై ఆధారాలు లేని ఆరోపణలు చేశారంటూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీ న్యూస్ చానెల్ కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత లీగల్ నోటీసులు పంపించారు. వారం రోజుల్లో తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. తన పై అసత్య ఆరోపణలు చేసిన

ఎవ్వరిని వదిలిపెట్టనని, తప్పుడు ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికీ లీగల్ నోటీసులు పంపిస్తానని స్పష్టం చేశారు.

(డెస్క్)

---------------------

**BJP-నిరశన:**

సింగరేణి సంస్థ అధ్వర్యంలో ప్రజాధనం దుర్వినియోగాన్ని అరికట్టాలని డిమాండు చేస్తూ రాష్ట్ర BJP నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధ్వర్యంలో హైదరాబాద్ సింగరేణి భవన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో శాసనసభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సింగరేణి నిధులను ఫుట్ బాల్ మ్యాచ్ కు ఖర్చుపెట్టి దుర్వినియోగం చేస్తున్నారని BJP ఆరోపించింది. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి ని, నిరసన వ్యక్తం చేస్తున్న ఆందోళన కారులను పోలీసులు అదుపులోకి తీసుకుని తరలించారు.

(MSL)

----------------------

**చౌహాస్ -సంతాపం**

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శివరాజ్ పాటిల్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో సుదీర్ఘ అనుభవం కలిగిన శివరాజ్ పాటిల్ దేశానికి చేసిన విశేష సేవలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. లోక్ సభ స్పీక ర్ గా, కేంద్ర హోం మంత్రిగా గవర్నర్ గా అనేక కీలక పదవులను సమర్థవంతంగా నిర్వహించి, దేశానికి ఆదర్శప్రాయమైన సేవలను అందించారని ముఖ్యమంత్రి కొనియాడారు. పలువురు మంతులు కూడా సంతాపం వ్యక్తం చేశారు.

(డెస్క్)

--------------------

**ప్రమాదం-కిషస్ రెడ్డి**

ఆంధ్రప్రదేశ్ -అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద జరిగిన ప్రైవేటు బస్సు ప్రమాదంలో పలువురు యాత్రికులు మృతిచెందటం తనను తీవ్రంగా కలచి వేసిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

(డెస్క్)

------------------

పంచాయతీ తొలి విడత

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి దశలో 84.28 శాతం పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ. రాణి కుముదిని ప్రకటించారు. నిన్న జరిగిన తొలి విడత పోలింగ్ లో మొత్తం 45 లక్షల 15 వేలకు పైగా ఓట్లు వినియోగించుకున్నారు. నోటిపై చేసిన 4 వేల 236 గ్రామ పంచాయతీలకు గాను, 395 సర్పంచ్ లు, 9 వేల 331 వార్డు సభ్యులు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో, 3 వేల 800కు పైగా గ్రామ పంచాయతీలు, 27 వేల 960 వార్డులలో పోలింగ్ నిర్వహించారు. ఈ తొలి దశ ఫలితాల్లో సగానికిపైగా స్థానాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించినట్టు తెలుస్తోంది.

**(ఎంఎస్ఎల్)**

--------------------------

మెస్సీ

ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ రేపు హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. ఇందుకోసం  భారీ భద్రతా మధ్య అధికార యంత్రాంగం భారీ భద్రతా  ఏర్పాట్లు చేస్తోంది. గోట్ ఇండియా టూర్ 2025 లో భాగంగా మెస్సీ రేపు సాయంత్రం మెస్సీ నగరానికి చేరుకుంటారు. రాత్రి 7 గంటల నుంచి ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్ లో పాల్గొంటారు.  ఇందులో మెస్సీ జట్టుతో తలపడే జట్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పోటీ పడతారు. పలువురు యువ క్రీడాకారులకు ఫుట్ బాల్ ఆటలో మెస్సీ మెళకువలు నేర్పిస్తారు.

**(డెస్క్)**

--------------------------

**సీఎం-ఫుట్ బాల్**

ముఖ్యమంత్రి  రేవంత్ రెడ్డి నిన్న రాత్రి  సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కంకోల్ వద్ద వోక్సెన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు.   విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ విభాగాల ఎగ్జిబిషన్ స్టాళ్లను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి ఆసక్తిగా తిలకించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని  అత్యాధునిక వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీని పరిశీలించిన ముఖ్యమంత్రి అక్కడి ఫుట్ బాల్ స్టేడియంలో విద్యార్థులతో కలిసి ఫుట్ బాల్ ఆడారు. ఫుట్ బాల్ తనకు ఇష్టమైన ఆట అన్న ముఖ్యమంత్రి తెలంగాణ జట్టుకు నాయకుడిగా నాలుగు కోట్ల ప్రజలను గెలిపించాలన్న తపన నిత్యం తనలో ఉందని సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు.

**(డెస్క్)**

--------------------------

**సిరిసిల్ల జిల్లా-పోలింగ్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిన్న ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని చందుర్తి, రుద్రంగి, వేముల రూరల్, కోనరావుపేట, వేములవాడ అర్బన్ మండలాల్లో 87 వేల 339 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 78. 58 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు.

**(పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

---------------------

**నల్లగొండ-పోలింగ్**

నల్లగొండ జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తెలిపారు తొలి విడతలో జిల్లా వ్యాప్తంగా 318 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు జరిగాయన్నారు. రెండో, మూడో విడత ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

**(పీటీసీ నల్లగొండ జిల్లా)**

------------------------

**నిర్మల్-పంచాయతీ**

నిర్మల్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ 6 మండలాల్లో ముగిసింది ఈ ఎన్నికల్లో గ్రామీణ ప్రజలు ఉత్సాహంగా ఓటు వేశారు. మొత్తం 136 గ్రామపంచాయతీలకు గాను 16 ఏకగ్రీవమయ్యాయి. 120 స్థానాలకు పోటీ జరిగి ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులు గెలుపొందారు.

**(పిటిసి నిర్మల్ జిల్లా)**

---------------------------

**ఆసిఫాబాద్ -ఎస్పీ**

ఆసిఫాబాద్ జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలు జరగనున్న సిర్పూర్ టి, కౌటాల, పెంచికలపేట, చింతలమానపల్లి, బెజ్జూర్, దహేగాం మండలాల్లో బందోబస్తు కోసం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధికి 3 ప్రత్యేక పార్టీలు కేటాయించినట్లు, 800 కు పైగా పోలీస్ సిబ్బందిని ఎన్నికలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

----------------------------

**భువనగిరి-ప్రచారం**

యాదాద్రి భువనగిరి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ఈ రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి ఎల్లుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిశ్శబ్ద కాలం అమల్లో ఉంటుందని యాదాద్రి భువనగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ సమయంలోబహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని, ఎలాంటి మాధ్యమాల్లోనూ ప్రచారం చేపట్టకూడదని తెలిపారు.

**పీ టీ సీ యాదాద్రి భువనగిరి**

------------------------------

**సూర్యాపేట-ఎస్పీ**

సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు వచ్చినా ఎన్నికల కోడ్ ముగిసే వరకు జిల్లాలో విజయోత్సవాలు, ర్యాలీలు, శోభాయాత్రలపై నిషేధం అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**( పిటిసి నల్లగొండ జిల్లా)**

---------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో కనిష్ఠా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్,జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో చలి గాలులు విస్తాయని పసువు రంగు హెచ్చరికను జారీ చేసింది.

**పీస్**

-------------------

**ఆసిఫాబాద్- చలి తీవ్రత**

ఆసిఫాబాద్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. నిన్న రాత్రి  రాష్ట్రంలోనే  అత్యల్ప ఉష్ణోగ్రత 5.6 డిగ్రీలు తిర్యానీలోని గిన్నెదరిలో నమోదయింది. చాలా ప్రాంతాల్లో ఈదురు గాలుల ప్రభావం పెరగడంతో ప్రజలు చలికి ఇబ్బంది పడుతున్నారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

--------------------

**సిరిసిల్ల-చలి**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా చలి విపరీతంగా పెరిగింది. ఈదురుగాలులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్న జిల్లాల్లో రాజన్న సిరిసిల్ల ఉందని అధికారులు తెలిపారు. జిల్లా లోని  రుద్రంగి మండలం మానాలలో అత్యల్పంగా 7.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

**(పీటీసీ, సిరిసిల్ల)**

--------------------